

బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.54,000
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,100

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో)	రూ.70,000
రిటైల్ వెండి గ్రాము	రూ.73

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	31	18
తిరుపతి	31	18
తిరుమల	27	14
గూడూరు	31	20
నగరి	32	18



శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లో 2 కంపార్టుమెంట్లు నిండా యి. దర్శన టికెట్లు లేని వారికి 12 గంటలు పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

చిత్తూరుకు స్టార్ లైనర్

- చిత్తూరు-2 డిపోకు 2 సర్వీసులు
- అధునాతన సౌకర్యాలు
- చిత్తూరు-హైదరాబాద్ -నాన్ ఏసీ స్లీపర్ సర్వీసులు
- ఈనెల 26 నుంచి ప్రారంభం



బెర్తులు



స్టార్ లైనర్ నాన్ ఏసీ స్లీపర్ సర్వీసు

చిత్తూరు రూరల్: ఇన్నాళ్లూ చిత్తూరు ఏపీఎస్ ఆర్టీసీలో సూపర్ లగ్జరీ సర్వీసులు మాత్రమే కనిపించేవి. ఇటీవల రెండు ఇంద్ర ఏసీ బస్సులు వచ్చాయి. అయితే స్లీపర్ బస్సులు అందుబాటులో లేవు. కొంతమంది ప్రైవేటు ఆపరేటర్లే దూరప్రాంతాలకు వీటిని నడుపుతున్నారు. వీటికి లభిస్తున్న ఆదరణను పరిశీలించిన ఆర్టీసీ కూడా ఇదే బాటపట్టింది. 'స్టార్ లైనర్' పేరిట నాన్-ఏసీ స్లీపర్ సర్వీసులను ప్రవేశపెడుతోంది. చిత్తూరు- హైదరాబాద్ మధ్య ఆర్టీసీ ప్రయోగాత్మకంగా ఈ సర్వీసులను ఈనెల 26 నుంచి ప్రారంభిస్తోంది.

చిత్తూరు జిల్లాలోని 5 డిపోల పరిధిలో 340 బస్సులు ఉన్నాయి. వీటిలో ఎక్స్‌ప్రెస్ బస్సులు, పల్లెవెలుగు, సూపర్ లగ్జరీ, అల్ట్రా సర్వీసులు ఉన్నాయి. గత ప్రభుత్వంలో అప్పటి అధికారులు, ప్రజాప్రతినిధులకు పలుమార్లు ఏసీ సర్వీసులు కావాలని చిత్తూరు వాసులు మొరపెట్టుకున్నా ఫలితం శూన్యం. ఈ నేపథ్యంలో గత ఏడాది పలువురు ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డిని కలిసి హైదరాబాద్‌కు ఏసీ, స్లీపర్ బస్సుల సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన ఆయన రెండు సర్వీసులకు ప్రతిపాదనలు పంపారు. ఇటీవల రెండు ఇంద్ర ఏసీ సర్వీసులను తెప్పించారు. ఇవి వేలూరు వయా చిత్తూరు నుంచి హైదరాబాద్‌కు నడుపుతున్నారు. వీటికి ఆదరణ లభిస్తోన్న క్రమంలోనే మళ్లీ స్టార్ లైనర్ సర్వీసులను ప్రవేశపెడుతుండటం విశేషం! వీటిలో అధునాతన సౌకర్యాలు కల్పించారు. ప్రయాణికులకు సౌకర్యవంతమైన ప్రయాణించాలనే ఉద్దేశంతో ఈ సర్వీసులను తెప్పించినట్లు అధికారులు చెప్పారు.



నగదు బహుమతిని అందుకుంటున్న సుమతి

ప్రయాణం ఇలా.....

ఈనెల 26 నుంచి స్టార్ లైనర్ బస్సు సర్వీసు రోజూ చిత్తూరు ఆర్టీసీ బస్టాండులో రాత్రి 9.30గంటలకు బయల్దేరి పీలేరు, రాయచోటి, కడప, కర్నూలు మీదుగా హైదరాబాద్ బెల్ ప్రాంతానికి మరుసటి రోజు ఉదయం 9 గంటలకు చేరుతుంది. అక్కడి నుంచి తిరిగి ఉదయం 7.15 గంటలకు బయలుదేరి అదే మార్గంలోనే చిత్తూరుకు రాత్రి 7 గంటలకు చేరుతుంది. ఇందులో మెరుగైన సదుపాయాలు, టికెట్ ధర అందుబాటులో ఉండడం, 12 గంటల్లోనే చేరుకునే అవకాశం ఉండడంతో ప్రయాణికుల నుంచి మంచి ఆదరణ లభిస్తుందనే ఆశాభావంతో ఆర్టీసీ అధికారులు ఉన్నారు. ఈ నాన్-ఏసీ స్లీపర్ చిత్తూరు నుంచి హైదరాబాద్‌కు కింద స్లీపర్‌కు రూ.1460, పైభాగంలో రూ.1,340, అలాగే చిత్తూరు నుంచి బెల్‌కు కింద భాగంలోని స్లీపర్‌కు రూ.1500, పైభాగంలో రూ.1380గా నిర్ణయించారు.

నాన్ ఏసీ స్లీపర్ ప్రత్యేకతలివే!



చిత్తూరు-2 డిపో గ్యారేజీలో బస్సును పరిశీలిస్తున్న అధికారులు

- 2+1 స్లీపర్ కోచ్
- 30 సాఫ్ట్ కుషన్ బెర్తులు (బ్యాక్ ప్యాడ్)
- సెల్ చార్జింగ్ పోర్ట్
- రీడింగ్ ల్యాంప్స్
- ప్రతి బెర్తుకూ లగేజీ ర్యాక్
- ఆడియో కోచ్
- అత్యవసర ద్వారం పైభాగంలో రెండు, వెనక భాగంలో ఒకటి ఏర్పాటు
- స్విచ్ టైప్, డ్రైవర్‌కు అనుకూలమైన సీటు
- సీసీ కెమెరా

స్టార్ లైనర్..ఆ పేరు ఎలా వచ్చిందంటే..

నాన్ స్లీపర్ సర్వీసుకు పేరు పెట్టాలని ఆర్టీసీ ప్రకటన ఇచ్చింది. దీనికి ప్రయాణికుల నుంచి విశేష స్పందన లభించింది. వివిధ ప్రాంతాలకు చెందిన 3,585 మంది నాన్ స్లీపర్ సర్వీసుకు పేర్లను సూచించారు. అయితే బైరెడ్డిపల్లె మండలం చిక్కనపల్లెకు చెందిన బండి రెడ్డెప్ప భార్య బి.సుమతి మెయిల్‌లో సూచించిన కొన్ని పేర్లలో 'స్టార్ లైనర్' పేరును ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమల రావు ఎంపిక చేశారు. స్టార్‌కు ఎస్-అంటే స్లీప్, టీ-అంటే ట్రావెల్, ఏ..అండ్, ఆర్...రిలాక్స్ అని వివరించారు. దీంతో ఎండీ సుమతి, అమె భర్తను అభినందించి సన్మానించారు. ప్రశంసాపత్రంతో పాటు రూ.10 వేల నగదును అందజేశారు.

మరిన్ని బస్సులు తెప్పిస్తాం



"ఇది వరకే తెప్పించిన రెండు ఇంద్ర సర్వీసులను హైదరాబాద్‌కే నడుపుతున్నాం. ఇప్పుడు స్టార్ లైనర్ సర్వీసు కూడా హైదరాబాద్‌కే ప్లాన్ చేశాం. లగ్జరీగా ప్రయాణం చేయవచ్చు. ఈ బస్సులతో పాటు మరిన్ని బస్సులు కూడా తెప్పించాలని ప్రతిప్రాదనలు పంపాం. ఈ సర్వీసులను జిల్లా వాసులు సద్వినియోగం చేసుకోవాలి.

–జితేంద్రనాథ్‌రెడ్డి, డీపీటీఓ, చిత్తూరు

న్యూస్‌రీల్

పోలీస్ స్పందనకు 21 అర్జీలు

చిత్తూరు అర్బన్: స్పందన అర్జీలను పరిశీలించి నిర్ణీత సమయంలో పరిష్కరించాలని ఎస్పీ రిశాంత్‌రెడ్డి ఆదేశించారు. చిత్తూరులోని తన కార్యాలయంలో సోమవారం పోలీస్ స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. మొత్తం 21 ఫిర్యాదులు రాగా చీటింగ్ 4, కుటుంబ తగదాలు 2, వేధింపులు 3, ఆస్తి తగదాలు 11, పోలీస్ సర్వీసెస్ 1 చొప్పున అందాయి. వీటిని సకాలంలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ ఎస్పీ నాగేశ్వర రావు, ఎస్‌బీ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, ఏఆర్ డీఎస్పీ మురళి, నీలకంఠేశ్వర రెడ్డి, మధు ఉన్నారు.

రేపు చిత్తూరులో 3-కె రన్



మాట్లాడుతున్న సీఈఓ ప్రభాకర్‌రెడ్డి, జిల్లా పర్యాటక, సాంస్కృతిక అధికారి రూపేంద్రనాథ్‌రెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: జాతీయ పర్యాటక దినోత్సవం సందర్భంగా 25వ తేదీన చిత్తూరులో 3-కె రన్ నిర్వహించనున్నట్లు జిల్లా పర్యాటక, సాంస్కృతిక అధికారి రూపేంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. ఆయన సోమవారం జెడ్పీ కార్యాలయంలో సీఈఓ ప్రభాకర్‌రెడ్డితో కలిసి కార్యక్రమ వివరాలను మీడియాకు తెలిపారు. ఆరోజు ఉదయం 7 గంటలకు స్థానిక గాంధీ విగ్రహం నుంచి అంబేడ్కర్ భవన్ వరకు విద్యార్థులతో 3-కె రన్, ఆ తర్వాత ఆజాదీ కా అమృత్ మహోత్సవంలో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం, ఉపన్యాసం, క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు అంబేడ్కర్ భవన్‌లో కలెక్టర్, ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేస్తామని వివరించారు.

మొక్కలు నాటితే పర్యావరణ పరిరక్షణ



నాటిన మొక్కకు నీళ్లు పోస్తున్న డీఎఫ్ఓ

చిత్తూరు కార్పొరేషన్: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటిని సంరక్షించి, పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని జిల్లా అటవీ శాఖాధికారి (డీఎఫ్ఓ) చైతన్యకుమార్‌రెడ్డి అన్నారు. స్థానిక ఆర్వీఎస్ నగర్ వద్ద నగరవనంలో ఎస్‌బీఐ ఆధ్వర్యంలో బాదం, ఉసిరి, జామ తదితర 50 మొక్కలను సిబ్బందితో కలిసి నాటి డీఎఫ్ఓ మీడియాతో మాట్లాడారు. రోడ్లకు ఇరువైపులా చెట్లు ఉంటే మంచిదన్నారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్వో బాలకృష్ణారెడ్డి, ఎస్‌బీఐ మేనేజర్ రమేష్‌కుమార్, డీఆర్వో స్వప్నకుమారి, ఎఫ్‌బీఓ రెడ్డిప్రసాద్, కుసుమ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్ఏఐ పీడీగా కార్తీక్‌రెడ్డి



చిత్తూరు కార్పొరేషన్: నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్ఏఐ) పీడీ (ప్రాజెక్టు డైరెక్టర్)గా ఏ.కార్తీక్‌రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. హైదరాబాద్‌లోని ఎన్‌హెచ్ఏఐ ప్రాంతీయ కార్యాలయంలో సాంకేతిక విభాగం డిప్యూటీ జనరల్ మేనేజర్‌గా ఉన్న కార్తీక్‌రెడ్డిని ఇక్కడికి బదిలీపై వచ్చారు. జిల్లాలో జరుగుతున్న చెన్నై-బెంగళూరు, చిత్తూరు-తచ్చూరు ఎక్స్‌ప్రెస్ హైవే పనులను వచ్చే ఏడాది లోపు పూర్తి చేయాలనే లక్ష్యంతో ఉన్నట్లు ఆయన మీడియాకు చెప్పారు.

ప్రజలకు క్షమాపణ చెప్పి పాదయాత్ర చెయ్

- నారా లోకేష్‌కు డిప్యూటీ సీఎం నారాయణస్వామి హితవు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం నారాయణ స్వామి

చిత్తూరు కలెక్టరేట్ : టీడీపీ పరిపాలనలో ప్రజలకు చేసిన అన్యాయానికి క్షమాపణ చెప్పి లోకేష్ పాదయాత్ర చేయాలని డిప్యూటీ సీఎం నారాయణస్వామి అన్నారు. చిత్తూరులో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సర్పంచ్‌గా కూడా గెలవలేని లోకేష్ పాదయాత్ర చేయడం హాస్యాస్పదమన్నారు. జిల్లాలో అడుగుపెట్టే ముందు టీడీపీ పరిపాలనలో మూసివేసిన పాల డెయిరీ, ఫ్యాక్టరీలు, చెరకు రైతులకు చేసిన అన్యాయానికి క్షమాపణలు చెప్పి తీరాలని డిమాండ్ చేశారు. ఇదలా ఉంచితే, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, బీసీ, ఇతర కులాలన్నింటికీ ప్రాధాన్యతనిచ్చారని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌ను పదేళ్లపాటు కొనసాగించేలా ఆర్డినెన్స్ తీసుకురావడం సీఎం చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. దేశ చరిత్రలో ఏ సీఎం చేయని విధంగా జగన్‌మోహన్‌రెడ్డి ఎస్సీ, ఎస్టీ, ఇతర కులాల ప్రజల అభ్యున్నతికి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ఓట్ల కోసం చంద్రబాబునాయుడు బడుగు, బలహీన వర్గాలను వంచించారని విమర్శించారు. ప్రతిపక్ష నేత చంద్రబాబు, ఆ పార్టీ నాయకులు రెచ్చగొట్టే ధోరణిలో మాట్లాడటం సరికాదని ఆక్షేపించారు.

పేదల కోసం పనిచేసే ప్రభుత్వం మాది

పాలసముద్రం : రాష్ట్రంలో పేదల కోసం పని చేసే ప్రభుత్వం తమదని, పేదల సొంతింటి కలను సాకారం చేసే దిశగా కృతనిశ్చయంతో ఊర్లకు ఊర్లనే నిర్మిస్తోందని డిప్యూటీ సీఎం, ఎక్సైజ్ శాఖ మంత్రి కే. నారాయణస్వామి పునరుద్ఘాటించారు. సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు తన హయాంలో ఇళ్ల నిర్మాణానికి నిధులు విదిల్చిన పాపానపోలేదని విమర్శించారు. రాబోవు ఎన్నికల్లో ప్రజలు మరోసారి టీడీపీకి బుద్ధి చెప్పడం తథ్యమన్నారు. సమావేశంలో రాష్ట్ర వైఎస్సార్ సీపీ సంయుక్త కార్యదర్శి ఎస్ శివప్రకాష్ రాజు, వైస్ ఎంపీపీ పుష్ప, సర్పంచ్ లిల్లి, ఉప సర్పంచ్ సుమన్‌రాజు, ఎంపీటీసీ గోవిందరాజు, పార్టీ మండల కన్వీనర్ తులసి యాదవ్ తదితర నాయకులు పాల్గొన్నారు.

పొరబడి.. తడబడి.. పరుగిడి..!

- కేటాయించిన సెంటర్‌కు బదులు మరో సెంటర్‌కు వచ్చిన అభ్యర్థిని
- టెన్షన్‌తో కళ్లు తిరిగి పడిపోయిన వైనం
- ఏఆర్ఐ చొరవతో సకాలంలో పరీక్ష కేంద్రానికి చేరిక



ఆర్ఐ మధును నగదు రివార్డుతో అభినందిస్తున్న ఎస్పీ

చిత్తూరు అర్బన్: పోలీస్ కానిస్టేబుల్ ప్రిలిమ్స్ పరీక్షలో ఓ అభ్యర్థిని ఉరుకులు పరుగులు మీద ఎస్వీసెట్ కాలేజి పరీక్ష కేంద్రానికి చేరుకుంది. అప్పటికే సమయం ఉదయం 9.47 గంటలు. అక్కడ డిస్‌ప్లే బోర్డులో తన హాల్‌టికెట్ నంబర్, రూమ్ కనిపించకపోయేసరికి కంగారుపడింది. ఆ అభ్యర్థిని వాలకం చూసి అనుమానించిన ఏఆర్ఐ మధు ఆ యువతిని పలకరించారు. ఆ యువతి వెళ్లవలసిన సెంటర్ చిత్తూరు సీతమ్స్ కాలేజీ అని హాల్‌టికెట్ చూసి గ్రహించారు. నీ సెంటర్ ఇది కాదమ్మా..టైం అయిపోతోందే..నీకున్నది ఇక 7 నిమిషాలే..! అని సానుభూతిగా చెప్పేసరికి ఆ యువతి బావురుమంది. అసలే టెన్షన్‌లో ఉన్న ఆ యువతి కళ్లు తిరిగి పడిపోయింది. దీంతో ఏఆర్ఐ ఆ యువతి ముఖం మీద నీళ్లు చిలకరించేసరికి తెప్పరిల్లింది. భయపడద్దమ్మా!? అంటూ అనునయించారు. నిన్ను సెంటర్‌కు చేరుస్తాం- అంటూ ధైర్యం చెప్పారు. తమ పోలీసు వాహనంలోకి ఎక్కించారు. ఆ యువతిని 5 కిలోమీటర్ల దూరంలోని ఆ పరీక్ష కేంద్రానికి ఆగమేఘాల మీద తీసుకెళ్లేలా చర్యలు తీసుకున్నారు. అంతే! మాటల్లో చెప్పలేనంత కృతజ్ఞత ఆ యువతి కళ్లల్లో వ్యక్తమైంది. థాంక్యూ సార్..థాంక్యూ సో మచ్..అంటూ ఉరుకులు పరుగులతో పరీక్ష కేంద్రంలోకి వెళ్లింది. అప్పటికే సమయం 9.59 గంటలు. ఇది తెలుసుకున్న ఎస్పీ రిశాంత్‌రెడ్డి ఏఆర్ఐ మధును అభినందిస్తూ నగదు రివార్డు అందజేశారు. సోమవారం ఈ ఘటన చోటుచేసుకుంది. అసలే టెన్షన్‌లో ఉన్న ఆ యువతి పేరు, ఊరు ఇత్యాది వివరాలేవీ అడగలేదని, సకాలంలో ఎగ్జామ్ సెంటర్‌కు చేరిస్తే చాలనే ఉద్దేశంతో తన విధి నిర్వర్తించానని 'సాక్షి'కి ఏఆర్ఐ చెప్పారు.

నేటి నుంచి జేఈఈ మెయిన్స్ పరీక్షలు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలో ఈ నెల 24 నుంచి జేఈఈ మెయిన్స్ పరీక్షలు నిర్వహించేందుకు అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. చిత్తూరు సమీపంలోని మురకంబట్టు వద్ద ఉన్న సీతమ్స్ ఇంజినీరింగ్ కళాశాల పరీక్ష కేంద్రంలో ఆన్‌లైన్ విధానంలో పరీక్షలు నిర్వహించనున్నారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తారు. ఈ పరీక్షకు 974 మంది విద్యార్థులు హాజరు కానున్నట్లు అధికారులు వెల్లడించారు. రోజూ ఉదయం, మధ్యాహ్నం 95 మంది చొప్పున, చివరి రోజు 24 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ నెల 24, 25, 28, 29, 30, 31 తేదీల్లో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. విద్యార్థులు ఉదయం 7 నుంచి 8.30 గంటల లోపు , మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 2.30 లోపు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని అధికారులు సూచించారు.

ఉత్తమ జిల్లా ఎన్నికల అధికారిగా హరినారాయణన్

చిత్తూరు కలెక్టరేట్ : రాష్ట్ర స్థాయిలో ఉత్తమ జిల్లా ఎన్నికల అధికారిగా చిత్తూరు కలెక్టర్ హరి నారాయణన్ ఎంపికయ్యారు. ఈ మేరకు సోమవారం రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ ముఖేష్ కుమార్ మీనా ఉత్తర్వులు జారీచేశారు. ఈ నెల 25న ఉదయం 11.30గంటలకు విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహించనున్నారు. ఆ కార్యక్రమంలో కలెక్టర్ ఉత్తమ అధికారి అవార్డును స్వీకరించనున్నారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎన్నికల కసరత్తులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన కలెక్టర్లను రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ అధికారి ఎంపిక చేశారు. ఓటరుకార్డుకు ఆధార్ అనుసంధానం 89 శాతం పూర్తి చేయించడం, పారదర్శకమైన ఓటర్ల జాబితా రూపకల్పన నేపథ్యంలో కలెక్టర్ హరినారాయణన్‌కు ఈ అవార్డు దక్కింది. ఎన్నికల కసరత్తులో సమర్థవంతంగా పనిచేసినందుకు గంగాధరనెల్లూరు నియోజకవర్గం 182 వ పోలింగ్ స్టేషన్ బీఎల్‌వో రూహి ఫాతిమా ఈ అవార్డుకు ఎంపికయ్యారు.

నేటి నుంచి కేంద్ర బృందం పర్యటన

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలో మంగళవారం నుంచి ఈనెల 31 వరకు కేంద్ర బృందం పర్యటించనుంది. ఈ బృందానికి కో-ఆర్డినేటర్‌గా జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి, లైజనింగ్ ఆఫీసర్‌గా ఏపీడీ సునీల్ వ్యవహరిస్తారు. ఒడిశా నుంచి బృంద సభ్యులు కుమార్‌సాహో, సత్యపత్రా బెహరా జిల్లాకు రానున్నారు. వీరు కేంద్ర పథకాలైన జాతీయ ఉపాధి హామీ పథకం, పెన్షన్, ప్రధాన మంత్రి ఆవాజ్ యోజన్, గ్రామీణ సడక్ యోజన్ రోడ్డు పనులను పరిశీలించనున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. వీరితో పాటు డ్వామా, డీఆర్‌డీఏ, హౌసింగ్ పీడీలు, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈలు, డీపీఆర్వో డీసీలు పర్యటనలో పూర్తి సమాచారంతో ఉండాలని ఆదేశాలు జెడ్పీ కార్యాలయానికి అందాయి.

ఉగాది నాటికి 24,859 గృహాల నిర్మాణం

- అలసత్వం వహిస్తే చర్యలు
- పనులు వేగవంతం చేయండి
- సమీక్షలో కలెక్టర్ హరి నారాయణన్



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ హరి నారాయణన్

సాక్షి, చిత్తూరు : జిల్లా వ్యాప్తంగా గృహ నిర్మాణ పనులను వేగవంతం చేసి పురోగతి సాధించాలని కలెక్టర్ హరి నారాయణన్ ఆదేశించారు. గృహ నిర్మాణాల పురోగతిపై కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా క్షేత్రస్థాయి అధికారులతో సమీక్షించారు. గృహ నిర్మాణాల విషయంలో నిర్దేశిత లక్ష్యాలను అధిగమించడానికి సరైన ప్రణాళికలతో ముందుకెళ్లాలన్నారు. ఇందులో ఎవరూ అలసత్వం వహించరాదని, దశలవారీగా పనులు ఎప్పటికప్పుడు పురోగతిలో ఉండేలా హౌసింగ్ శాఖ, క్షేత్రస్థాయిలో అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సమన్వయంతో పనిచేసి జిల్లాలో ఉగాది నాటికి 24,859 గృహాలను పూర్తి చేసి ప్రారంభోత్సవాలకు సిద్ధం చేయాలని ఆదేశించారు. అవసరమైన సామగ్రిని ఇతర ప్రాంతాల నుంచి తెప్పించాలన్నారు. జిల్లాకు సరిహద్దులోని తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి కూలీలను పిలిపించి పనులను వేగవంతం చేయించాలన్నారు. జేసీ వెంకటేశ్వర్ మాట్లాడుతూ లే అవుట్లలో సమస్యలున్న పక్షంలో పరిష్కరించాలని హౌసింగ్ శాఖ అధికారులను ఆదేశించారు. లే అవుట్లలో నీరు, విద్యుత్, రోడ్ల వసతి కల్పించాలన్నారు. సమీక్షలో హౌసింగ్ పీడీ పద్మనాభం తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మాజీ మేయర్ హత్య కేసు విచారణ 30కి వాయిదా

చిత్తూరు అర్బన్: చిత్తూరు మాజీ మేయర్ అనురాధ, ఆమె భర్త కటారి మోహన్ జంట హత్యల కేసు విచారణను ఈనెల 30వ తేదీకి వాయిదా వేస్తూ చిత్తూరులోని 6వ అదనపు జిల్లా సెషన్స్ న్యాయస్థానం సోమవారం ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసులో ప్రధాన నిందితుడైన చింటూతో పాటు పలువురు నిందితులు న్యాయస్థానం ఎదుట హాజరవగా.. న్యాయమూర్తి శాంతి విచారణను వాయిదా వేశారు.

నేడు అవగాహన ర్యాలీ

చిత్తూరు రూరల్: రోడ్డు భద్రత వారోత్సవాలను పురస్కరించుకుని చిత్తూరు నగరంలో మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్నట్లు డీటీసీ బసిరెడ్డి తెలిపారు. ఉదయం 10 గంటలకు నగరంలోని డీటీసీ కార్యాలయం నుంచి వాహనాల ర్యాలీ ప్రారంభమవుతుందన్నారు. అక్కడి నుంచి కలెక్టర్ బంగ్లా వరకు ర్యాలీ నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు.

'స్పందన' అర్జీల పరిష్కారానికి ప్రాధాన్యత

- కలెక్టరేట్ హరినారాయణన్
- అర్జీలు స్వీకరించిన కలెక్టర్, జేసీ వెంకటేశ్వర్




స్పందన కార్యక్రమంలో అర్జీని పరిశీలిస్తున్న కలెక్టర్ హరి నారాయణన్. అర్జీలిచ్చేందుకు వచ్చిన ప్రజలు

చిత్తూరు కలెక్టరేట్ : స్పందన కార్యక్రమంలో నమోదయ్యే అర్జీల పరిష్కారానికి ఆయా శాఖల అధికారులు ప్రత్యేక ప్రాధాన్యతనివ్వాలని కలెక్టర్ హరి నారాయణన్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి కలెక్టర్, జేసీ వెంకటేశ్వర్ అర్జీలు స్వీకరించారు. వాటిని పరిశీలించి అక్కడికక్కడే పలు సమస్యలను పరిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ, స్పందన వినతులను పరిష్కరించడంలో అధికారులు క్షేత్రస్థాయిలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో రెవెన్యూ : 217, విద్యాశాఖ : 2, వైద్య ఆరోగ్య శాఖ : 1, మైనారిటీ వెల్ఫేర్ : 2, హౌసింగ్ : 8, హార్టికల్చర్ : 3 చొప్పున మొత్తం 233 అర్జీలు అందాయని కలెక్టరేట్ అధికారులు వెల్లడించారు. డీఆర్‌ఓ రాజశేఖర్, జెడ్పీ సీఈఓ ప్రభాకర్ రెడ్డి, పలు శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

108 ఉద్యోగుల ధర్నా

తమ సమస్యలను పరిష్కరించాలని 108 ఉద్యోగులు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. తమను ప్రభుత్వ ఒప్పంద ఉద్యోగులుగా గుర్తించాలని, ఈఎస్‌ఐ, ప్రమాద బీమా వర్తింపజేయాలన్నారు. పెండింగ్ వేతనాలను జమచేయాలని, ప్రతి నెలా జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. 108 నిర్వహణ బాధ్యతలను నూతన సంస్థ తొలగించిన ఉద్యోగుల్ని తిరిగి విధుల్లోకి తీసుకోవాలన్నారు. సీఐటీయూ నాయకులు గంగరాజు, సురేంద్ర, 108 యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

పోస్టుమార్టం నివేదిక ఇవ్వరూ!

తమ కుమారుడు మృతదేహానికి నిర్వహించిన పోస్టుమార్టం నివేదికను త్వరితగతిన ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని పుంగనూరు మండలం మంగళం కాలనీకి చెందిన గంగులప్ప, గిరిజమ్మ గ్రామస్తులతో కలిసి స్పందనలో వినతి పత్రం అందజేశారు. తన కుమారుడు శ్రీనాథ్ కనిపించకపోవడంపై గత ఏడాది నవంబర్‌లో ఫిర్యాదు చేశామన్నారు. డిసెంబర్ 4న పుంగనూరులోని తైలంతోపు వద్ద మృతదేహం వెలుగులోకి వచ్చిందని, అయితే పోస్టుమార్టం నివేదికను ఇప్పటివరకు ఇవ్వలేదని వాపోయారు. తమకు న్యాయం చేయాలని కోరారు.

ఆక్రమణతో దారి బంద్

తమ ఇంటి చుట్టూ ఉన్న స్థలాన్ని ఓ వ్యక్తి ఆక్రమించి దారి లేకుండా చేశాడని చిత్తూరు రూరల్ మండలం మాపాక్షి ఎస్సీ కాలనీకి చెందిన మల్లిక వినతి పత్రం ఇచ్చింది. ఇంటికి రెండు వైపులా ఉన్న గుట్ట భూముల్లో పునాదులు తవ్వుతున్నారని, దీనిపై చర్యలు తీసుకోవాలని కోరింది.

ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ హరి నారాయణన్ ఆదేశించారు. సోమవారం జిల్లా రోడ్డు భద్రత కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, జిల్లాలోని వివిధ ఆలయాలు, పర్యాటక ప్రాంతాలకు ఇతర రాష్ట్రాల నుంచి వస్తుంటారన్నారు. జిల్లాలో మూడు ప్రధాన రహదారులు ఉన్నాయన్నారు. వివిధ ప్రదేశాల నుంచి భారీ వాహనాలు జిల్లా మీదుగా సరిహద్దు రాష్ట్రాలకు వెళ్తుంటాయని చెప్పారు. జిల్లాలో ఉన్న వాహనాలతోపాటు గత ఐదేళ్ల నుంచి చోటుచేసుకున్న ప్రమాదాలపై సమీక్షించినట్లు చెప్పారు. జిల్లాలో ఇప్పటికే 39 ప్రమాద స్థలాలను గుర్తించినట్లు తెలిపారు. పలమనేరు–కుప్పం, పలమనేరు–పుంగనూరు, పలమనేరు–చెన్నై రహదారి వరకు, చిత్తూరు–పీలేరు సమీపం వరకు ప్రధాన రహదారుల్లో ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటివరకు గుర్తించిన ప్రాంతాలతో పాటు మరో 19 ప్రమాద ప్రాంతాలను రవాణా సంస్థ గుర్తించిందని, ఆయా ప్రమాద ప్రాంతాల వద్ద హెచ్చరిక బోర్డులను వెంటనే ఏర్పాటు చేసి ప్రమాద రహిత రోడ్లుగా తీర్చిదిద్దాలని సూచించారు. ఇటీవల కాలంలో రోడ్డుకు ఇరువైపులా వేస్తున్న గ్రానైట్ వ్యర్థాలు కూడా ప్రమాదాలకు తావిస్తున్నాయని, వాటిని తొలగించడంతోపాటు ఆ వ్యర్థాలను వేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని మైనింగ్ అధికారులను ఆదేశించారు. సమీక్షలో అడిషనల్ ఎస్పీ జగదీష్, డీటీసీ బసి రెడ్డి, ప్రజా రవాణా అధికారి జితేందర్ రెడ్డి, జాతీయ రహదారి అధికారి మురళీకృష్ణ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారి నరేంద్రబాబు, మైన్స్ డీడీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గౌహతికి సీఎం సహాయనిధి చెక్కు పంపిణీ

తిరుపతి మంగళం : పూతలపట్టు వైస్ ఎంపీపీ సుబ్బారెడ్డి వైఎస్సార్ సీపీకి ఎనలేని సేవలు అందించారని, ఆయన మృతి పార్టీకి తీరని లోటని రాష్ట్ర అటవీ, విద్యుత్, భూగర్భ గనులశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. ఆయన సోమవారం తిరుపతి మారుతీనగర్‌లోని తన నివాసంలో మృతుడు సుబ్బారెడ్డి సతీమణి గౌహతిరెడ్డికి ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు అందజేశారు. ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడంలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి సాటి ఎవరూ లేరని తెలిపారు.



సుబ్బారెడ్డి సతీమణికి సీఎం సహాయనిధి చెక్కు అందజేస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

శభాష్ శరణ్య

- దొరికిన రూ.80వేల విలువైన బంగారు చైను
- క్లాస్ టీచర్ ద్వారా బాధితురాలికి అప్పగింత

చౌడేపల్లె: చారాల ఉన్నత పాఠశాలలో 6వ తరగతి విద్యార్థిని పి.శరణ్యకు సుమారు రూ.80 వేలు విలువ చేసే బంగారు చైను దొరికింది. ఆ చైనును పోగొట్టుకున్న వారికి అందజేసి శభాష్ అనిపించుకుంది. హెచ్‌ఎం టి.నరసింహులు సోమవారం తెలిపిన వివరాలు..పుంగనూరు మండలం ఇటికి నెల్లూరుకు చెందిన పి.విజయభాస్కర్ కుమార్తె పి.శరణ్య చారాల ఉన్నత పాఠశాలలో చదువుతోంది. రెండు రోజుల క్రితం శరణ్య స్కూలు క్రీడా మైదానంలో ఆడుకుంటూ ఉండగా బంగారు చైను కంటబడింది. దీనిని తీసుకుని క్లాస్ టీచర్ శివకుమార్‌కు అందజేసింది. ప్రాథమిక పరిశీలనలో చారాలకు చెందిన మెకానిక్ ఈశ్వరయ్య కుమార్తె వేదశ్రీ ఈ చైను పోగొట్టుకున్నట్లు గుర్తించారు. శరణ్య, ఉపాధ్యాయులతో కలిసి బాధితురాలికి ఆ చైనును అందజేసింది. తనకు దొరికిన విలువైన ఆభరణాన్ని నిజాయితీతో అప్పగించిన శరణ్యను పలువురు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శరత్‌చంద్ర, సహదేవ, రామకృష్ణ, అరుణ, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



చారాల ఉన్నత పాఠశాలలో బాధితురాలికి బంగారు చైను అందజేస్తున్న శరణ్య

మోటార్ సైకిల్ ఢీకొన్న గుర్తు తెలియని వాహనం

- ఒకరు మృతి, ఇద్దరికి గాయాలు

గంగవరం: మోటార్ సైకిలిస్టులను గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఓ యువకుడు మృతి చెందాడు. మరో ఇద్దరు గాయపడ్డారు. సోమవారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. ఎస్ఐ సుధాకర్ రెడ్డి కథనం..పసుపత్తూరు పంచాయతీ ఎగువ గొర్రెలదొడ్డికి చెందిన మధు(20) ద్రాక్ష, దానిమ్మ తోటలకు పైన వల కట్టే పనులు చేస్తుంటాడు. కర్ణాటక రాష్ట్రం విజిలాపురం వద్ద ఈ పనులు కూలీలతో చేయిస్తున్నాడు. మంగళవారం గ్రామంలో పండుగ వేడుకలను హాజరయ్యేందుకు సోమవారం రాత్రి ద్విచక్ర వాహనంలో స్వగ్రామానికి చెందిన చెన్నకేశవ(20), ఆంజి(16)తో కలిసి మోటార్ సైకిల్‌లో బయల్దేరాడు. మార్గమధ్యంలో పలమనేరు–బెంగుళూరు జాతీయ రహదారిలోని ఆలకుప్పం సమీపంలో వెనుక నుంచి గుర్తు తెలియని వాహనం వీరిని ఢీకొని ఆగకుండా వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో మధు తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. మిగిలిన ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు వారిని చికిత్స నిమిత్తం పలమనేరుకు తరలించారు. సమాచారం చేరవేయడంతో ఎస్ఐ తన సిబ్బందితో కలిసి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మధు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలమనేరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసిన పోలీసులు ప్రమాదానికి కారణమైన గుర్తు తెలియని వాహనాన్ని సీసీ కెమెరాలతో గుర్తించే పనిలో పడ్డారు.



ప్రమాదంలో మృతి చెందిన మధు

జాతీయ పక్షిని కాపాడారు

చిత్తూరు కార్పొరేషన్: బండరాళ్లలో కాలు ఇరుక్కుపోయి ఎగరలేక, నడవలేక, అవస్థలు పడుతున్న నెమలికి ఓ రైతు చొరవతో మోక్షం లభించింది. వివరాలు.. స్థానిక సిద్ధంపల్లె రైల్వేస్టేషన్ సమీపంలోని ఓ పొలంలో బండరాళ్ల విహరిస్తూ అనుకోని ప్రమాదానికి గురైంది. బండరాళ్ల మధ్య కాలు ఇరుక్కుపోవడంతో బాధగా అరవసాగింది. దాని అరుపులు విన్న ఆ పొలం రైతు దేవేంద్ర ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ మధుకు సమాచారం చేరవేశారు. హుటాహుటిన తన సిబ్బందితో అక్కడికి చేరుకున్న ఆయన సురక్షితంగా ఆ నెమలికి వెలికితీశారు. పశువైద్యుడి చేతో ప్రథమ చికిత్స చేయించారు. కాలుకు కట్టు కట్టించారు. అది పూర్తిగా కోలుకున్న తర్వాత తిరుపతి జూపార్కులో విడిచిపెడతామని చెప్పారు.



ఎఫ్‌బీఓ మధుకు నెమలిని అప్పగించిన రైతు దేవేంద్ర

ట్రాన్స్‌ఫార్మర్ దొంగల అరెస్ట్

రేణిగుంట: పొలాల్లో వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లు దొంగలించే ఇద్దరిని సోమవారం అరెస్ట్ చేసినట్లు గాజులమండ్యం ఎస్ఐ ధర్మారెడ్డి తెలిపారు. గాజులమండ్యం, ఏర్పేడు, పుత్తూరు, వడమాలపేట తదితర ప్రాంతాల్లోని పొలాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకి గురవుతున్నాయని ఫిర్యాదులు అందడంతో పోలీసులు నిఘా పెట్టారు. వడమాలపేట మండలం కాయంపేటకు చెందిన బోయినపల్లి రమేష్(23), చంద్రగిరి మండలం పైడిపల్లెకు చెందిన గుండ్లూరు ఆదినారాయణ(29) కలసి ట్రాన్స్‌ఫార్మర్లు దొంగతనం చేసి, అందులోని కాపర్ వైర్లను అమ్ముకుని సొమ్ము చేసుకునే వారు. ఈ క్రమంలో సోమవారం గాజులమండ్యం ఆయిల్ ఫ్యాక్టరీ కూడలి వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్న వీరిద్దరినీ అదుపులోకి తీసుకోవడంతో చోరీల బాగోతం బైటపడింది. వారి నుంచి రెండు ట్రాన్స్‌ఫార్మర్లకు సంబంధించిన కాపర్ వైరును స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.



ట్రాన్స్‌ఫార్మర్ దొంగల అరెస్ట్ చూపుతున్న గాజులమండ్యం పోలీసులు

యువతి ఆత్మహత్య


గంగవరం: ఇంటిలో ఉరేసుకుని ఓ యువతి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో సోమవారం చోటుచేసుకుంది. వివరాలు.. గంగవరం పంచాయతీ మన్నారునాయనిపల్లెకు చెందిన రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి ఉదయ్‌కుమార్ రెండవ కుమార్తె శ్రీవాణి(21) పలమనేరులోని ఓ ప్రైవేట్ కళాశాలలో బీకాం పూర్తి చేసి తల్లిదండ్రులతో ఇంటి వద్దే ఉంటోంది. ల్యాప్‌టాప్‌లో చదువుకు సంబంధించి పని చేసుకుంటున్న శ్రీవాణిని ఇంటి వద్దనే వదిలి ఉదయాన్నే ఆమె తల్లిదండ్రులు పొలం పనులకు వెళ్లిపోయారు. మధ్యాహ్నం ఇంటికి తిరిగివచ్చారు. అయితే గదిలో మౌల్డింగ్ కొక్కికి చీరతో ఉరేసుకుని శ్రీవాణి బలవన్మరణం చెంది ఉండటం చూసి దిగ్భ్రాంతికి గురయ్యారు. ఆత్మహత్యకు ముందు ఒక అబ్బాయితో ఫోన్‌లో చాటింగ్ చేసినట్టు స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతురాలి మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలమనేరు ఆసుపత్రికి తరలించారు. మృతురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. శ్రీవాణితో చాటింగ్ చేసిన వ్యక్తి ఎవరు, చాటింగ్‌లో ఏముంది? ఆత్మహత్యకు ఇది కారణమా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలికి ఒక అక్క, చెల్లెలు ఉన్నారు.



శ్రీవాణి మృతదేహం

ఈ మృతుడు ఎవరో?

- రైలు కింద పడి గుర్తుతెలియని యువకుడి మృతి



నగరి : వేపగుంట–నగరి రైల్వేస్టేషన్ల మధ్య ఎగువ ట్రాక్‌పై 97/23–21 పోస్టు వద్ద సోమవారం గుర్తు తెలియని యువకుడు మృతి చెందాడు. రేణిగుంట రైల్వేస్టేషన్ ఎస్ఐ రవి తెలిపిన వివరాలు.. రైలు నుంచి జారి కింద పడడంతో తీవ్రగాయాలైన ఓ వ్యక్తి మరణించినట్లు ఆనవాళ్లు బట్టి గుర్తించారు. మృతుడి వయస్సు సుమారు 30–34 ఏళ్లు ఉండొచ్చని చెప్పారు. మృతుడి కుడిచేతిపై గేదె తల పచ్చబొట్టు, ఛాతీపై రేఖ అని తమిళ అక్షరాల పచ్చబొట్టు ఉంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నగరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 9963126343 నంబరుకు సంప్రదించాలని రైల్వే ఎస్ఐ కోరారు.

గుర్తుతెలియని వృద్ధురాలి మృతి

ఏర్పేడు: తిరుపతి రుయాలో చికిత్స పొందుతూ గుర్తు తెలియని వృద్ధురాలు(72) మృతి చెందినట్లు ఏర్పేడు సీఐ శ్రీహరి తెలిపారు. ఈ నెల 1న స్థానిక తహసీల్దారు కార్యాలయం ముందు తలకు గాయాలై ఆర్ అండ్‌బీ రోడ్డుపై అపస్మారక స్థితిలో పడిఉన్న గుర్తు తెలియని వృద్ధురాలిని ఏర్పేడు 108 సిబ్బంది చికిత్స కోసం తిరుపతి రుయాకు తరలించినట్లు వివరించారు. అక్కడ చికిత్స పొందుతూ వృద్ధురాలు సోమవారం రాత్రి మృతి చెందినట్టు పేర్కొన్నారు. ఆచూకీ తెలిసిన వారు 9440900729 నంబరుకు సమాచారం అందించాలని ఆయన సూచించారు.

ఆపరేషన్‌కు సాయం చేయరూ!

- దాతలకు వినతి



తన్వీర్ అలీ

రొంపిచెర్ల: ఆపరేషన్ కోసం దాతలు సాయం చేసి ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు. బాధితుల కథనం..అన్నమయ్య జిల్లా కలకడకు చెందిన ఫైరోద్‌అలీ పదేళ్ల క్రితం రొంపిచెర్ల గ్రామ పంచాయతీ కొలిమి వీధికి వచ్చి జీవిస్తున్నాడు. ఇతనికి భార్య రాఫియా, పిల్లలు నేహా(13), తన్వీర్‌అలీ (11), హాలియా(9) ఉన్నారు. కుమారుడు తన్వీర్ అలీకి పుట్టుకతో గుండె జబ్బుతో బాధ పడుతున్నాడు. దీనికి తోడు మలద్వారం లేకుండా జన్మించడంతో తల్లిదండ్రులకు కష్టాలు తప్పలేదు. గుండె జబ్బుకు హైదరాబాదులో ఆపరేషన్ చేయించారు. మలద్వారం లేకపోవడంతో కడుపు పక్కన రంధ్రం ఏర్పాటు చేశారు. దీనికి ఆపరేషన్ చేయడానికి చెన్నైకు చెందిన డాక్టర్లు రూ.1.20 లక్షలు ఖర్చు అవుతుందని చెప్పారు. అయితే రెక్కాడితే డొక్కాడని తమకు ఆపరేషన్ చేయించే స్తోమత లేదని ఫైరోద్ దంపతులు కన్నీటిపర్యంతమయ్యారు. దాతలు తమ కుమారుడి శస్త్రచికిత్సకు సాయం చేయాలని వేడుకున్నారు.